
Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 116 | బుధవారం 1 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## భయపెట్టే రాజకీయాల్ని ఆపండి: రాహుల్ గాంధీ




**హైదరాబాద్-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30:** లడఖ్ ప్రజలతో చర్చలు జరపాలని కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీ మంగళవారం కేంద్రాన్ని కోరారు. ఈ సందర్భంగా హింసను ప్రేరేపించే, భయపెట్టే రాజకీయాలను ఆపమని కేంద్రాన్ని రాహుల్ కోరారు. లడఖ్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై నిష్పక్షపాత న్యాయవిచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. మరణించిన వారిలో సైనికుల కుటుంబానికి చెందిన వారు కూడా ఉన్నారని రాహుల్ ఎత్తిచూపారు. 'తండ్రి సైనికుడు. కొడుకు కూడా సైనికుడే. వారి రక్తంలో దేశభక్తి ప్రవహిస్తోంది. అయినప్పటికీ లడఖ్ కోసం,

- మిగతా 2లో..

## తెలుగు సినిమాకు షాక్ ఇచ్చిన ట్రంప్..


### - విదేశీ సినిమాలపై 100 శాతం టారిఫ్ (పన్ను) వసూలు



**న్యూ ఢిల్లీ/హైదరాబాద్- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30:** ;తెలుగు సినిమా ఇండస్ట్రీకు గట్టి ఎదురుదెబ్బ తగలబోతోంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయం వల్ల, ఇండియన్ మూవీలకు, ముఖ్యంగా తెలుగు సినిమాలకు అమెరికా మార్కెట్‌లో పెద్ద నష్టం వచ్చే అవకాశముంది. డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించిన నిర్ణయం ప్రకారం, అమెరికాలో విడుదలయ్యే విదేశీ సినిమాలపై 100 శాతం టారిఫ్ (పన్ను) వసూలు చేయాలని నిర్ణయించారు. అంటే, భారతదేశంలో నిర్మించిన సినిమాలను అమెరికాలో విడుదల చేయాలంటే డబుల్ ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో తెలుగు సినిమాలకు భారీ ఆదరణ ఉంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి వచ్చే కలెక్షన్లలో 75-80% వరకు నార్త్ అమెరికా నుంచే వస్తుంది.

- మిగతా 2లో..

## ప్రతి 5 రోజులకు ఒక కొత్త బిలియనీర్




**ముంబై- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30:** భారతదేశంలో గత కొన్నేళ్లుగా ఆర్థికాభివృద్ధి వేగంగా జరుగుతోంది. కొత్త పరిశ్రమలు, చాలా పెద్ద కంపెనీలు భారతదేశానికి వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కోటీశ్వరులు, బిలియనీర్ల సంఖ్య కూడా అదే రీతిగా పెరుగుతోంది. సంపదలో భారతదేశంలో కొత్త రికార్డులు సృష్టిస్తోంది. దేశంలో ప్రతి 30 నిమిషాలకు ఒక కొత్త కోటీశ్వరుల కుటుంబం తయారవుతోంది. బిలియనీర్ల విషయానికి వస్తే, కొత్త నివేదిక ప్రకారం ప్రతి 5 రోజులకు భారతదేశంలో ఒక కొత్త బిలియనీర్ పుట్టుకొస్తున్నాడు. ప్రతి 5 రోజులకు ఒక బిలియనీర్ పుడుతున్నప్పుడు, ఈ విషయంలో భారత్ ప్రపంచంలో ఏ స్థానంలో ఉందో ఇక్కడ తెలుసుకుందాం.దమెర్సిడేస్ బెంజ్ 2025 ప్రకారం, భారతదేశంలో కోటీశ్వరులు వేగంగా పెరుగుతున్నారు.

- మిగతా 2లో..

## భారత్‌లో పెట్టుబడులకు అత్యుత్తమ రాష్ట్రం ఏపీ





- పెట్టుబడులను ఆకర్షించడంలో మాకు ట్రాక్ రికార్డు ఉంది
- వివిధ రంగాల్లో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు
- విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామిక వేత్తలు రావాలి
- సీఐఐ పార్టనర్షిప్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఢిల్లీ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30:** భారతదేశంలో పెట్టే పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా పరిశ్రమలకు అనుమతులిస్తామని తెలిపారు. వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. నవంబర్ 14, 15వ తేదీల్లో విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలను, వివిధ దేశాల రాయబారులను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."విశాఖలో నిర్వహించే 30వ భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామిక వేత్తలను, వివిధ దేశాల రాయబారులను సాదరంగా ఆహ్వానిస్తున్నాం. నవంబరు 14, 15వ తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగుతుంది. పరిశ్రమలకు అనువుగా ఉండేలా లాజిస్టిక్స్ ను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారుల నిర్మాణం చేపడుతున్నాం. సంపద సృష్టికి పెట్టుబడులు రావాలి, సంపద సృష్టిస్తేనే పేదరికాన్ని నిర్మూలించగలం. ప్రధాని మోదీ వికసిత్ భారత్ 2047 రూపొందిస్తే.. మేం స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపకల్పన చేశాం. ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటమే స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యం. దీని కోసం 10 సూత్రాలను ఆధారంగా చేసుకుని పని చేస్తున్నాం. లాజిస్టిక్స్, డీప్ టెక్నాలజీ, ప్రొడెక్టు పర్ఫెక్షన్ లాంటి కీలకమైన లక్ష్యాలను పెట్టుకున్నాం. సమీకృత అభివృద్ధి అనేది ఇప్పుడు ఓ నినాదం... పీ4 ద్వారా సమీకృత అభివృద్ధి సాధ్యం. స్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్, ఏరోస్పేస్ సిటీలను ఏపీలో ఏర్పాటు చేస్తున్నాం." అని సీఎం చెప్పారు.

- మిగతా 2లో..


## తెలుగుతల్లి ఫ్లైఓవర్' పేరు 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'గా మార్పు



**హైదరాబాద్- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30:** నగరంలోని ట్యాంక్‌బండ్ సమీపంలో ఉన్న 'తెలుగుతల్లి ఫ్లైఓవర్' పేరు మారింది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిచేలా దీనికి 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'గా నామకరణం చేశారు. 1997లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఫ్లై ఓవర్‌కి శంఖుస్థాపన చేశారు. సచివాలయం పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న వాహన రద్దీ దృష్ట్యా ఈ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. ఎనిమిది సంవత్సరాల పాటు ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం సాగింది. 2005లో అప్పటి పురపాలక శాఖ మంత్రి కొనేరు రంగారావు ఈ ఫ్లైఓవర్‌ని ప్రారంభించి ప్రజల వినియోగానికి అంకితం చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలుగుతల్లి ఫ్లైఓవర్ పేరులో మార్పు అవసరముందని చర్చ ప్రారంభమైంది. తాజాగా జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ దీని పేరును 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'గా మార్చాలని నిర్ణయం తీసుకుంది. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

- మిగతా 2లో..


## ఏపీలో 18నగరవనాలు




**అనంతపురం-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30:** ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ కేంద్రానికి కీలక ప్రతిపాదన చేసింది. రాష్ట్రంలో కొత్తగా 18 నగర వనాలను ఏర్పాటు చేయాలని కోరింది. అన్ని నియోజకవర్గాల్లో నగర వనాలు ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం దిశగా ఇప్పటికే పనులు జరిగాయి. ఇప్పటివరకు 54 నియోజకవర్గాల పరిధిలో 61 పార్కులకు అనుమతి లభించింది. వీటిలో 18 పార్కులను ఇప్పటికే ప్రజల కోసం ప్రారంభించారు. మరో 10 పార్కులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన 33 చోట్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. కేంద్రం ఆమోదం తెలిపిన వెంటనే 11 జిల్లాల పరిధిలోని 14 నియోజకవర్గాల్లో ఈ పార్కులను ఏర్పాటు చేస్తారు. ఇది రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచే పెద్ద ప్రణాళికలో భాగమని చెబుతున్నారు అధికారులు.ఇప్పటివరకు మంజూరైన వాటికి అదనంగా, ఇప్పుడు మరో 18 నగర వనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ఈ కొత్త పార్కులను శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, నెల్లూరు, తిరుపతి, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు.

- మిగతా 2లో..

## పొంచి ఉన్న సునామీ ముప్పు



- మిగతా 2లో..

**కాకినాడ-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30:** మనదేశంలో గుజరాత్ తర్వాత అతిపెద్ద తీరరేఖ కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ కు పేరుంది. ఆంధ్రప్రదేశ్లో తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, గుంటూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాలు సముద్రానికి దగ్గరగా ఉంటాయి. ఈ ప్రాంతాలలో సముద్ర రవాణా జరుగుతూ ఉంటుంది. అయితే ఈ ప్రాంతాలలో వర్షాలు కురిసినప్పుడు.. సముద్రంలో ఆటుపోట్లు ఏర్పడినప్పుడు సముద్రపు నీరు ముందుకు వస్తుంది. అలల తాకిడి కూడా అధికంగా ఉంటుంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలో వర్షాకాలం సముద్రపు ఎగపోటు అధికంగా ఉంటుంది. అలలు ఉప్పొంగుతాయి. ఇక్కడ వర్షాకాలంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంటుంది. నీరు తీవ్రంగా రావడం వల్ల తీర ప్రాంతం నిత్యం కోతకు గురవుతూ ఉంటుంది.

## ఐఏఎస్‌లపై మంత్రుల గుర్రు

### - సీఎంకు కంప్లయింట్

**హైదరాబాద్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30:** అంతా మేమే. అమాత్యులైనంత మాత్రాన వాళ్లు చెప్తే వినాలా..వాళ్లకు ఏం తెలుసు. మా డైరెక్షన్స్ ప్రకారమే వాళ్లు నడుచుకోవాలి. ఇది తెలంగాణలోని కొందరు ఐఏఎస్, ఐపీఎస్ ల తీరు అంటూ..సెక్రటేరియట్ లో గుసగుసలు మొదలయ్యాయి. మంత్రుల ఆదేశాలను బ్యూరోక్రాట్స్ పిచ్చ లైట్ తీసుకుంటున్నారట. పైగా మీకేం తెలుసు అన్నట్లుగా నేరుగా మంత్రులతోనే మాట్లాడుతున్నారట. మంత్రులకే సలహాల మాదిరిగా క్లాసులు పీకుతున్నారట కొందరు అధికారులు. మంత్రి అంటే. సీఎం తర్వాత ప్రభుత్వంలో కీలక ర్యాంకున్న నేత. రెండు మూడు శాఖలు మంత్రి పరిధిలోనే ఉంటాయి. మంత్రులుగా వాళ్లకు కొత్త అయినా, పాత వాళ్లు అయినా ఆయా శాఖలకు వారే బాసులు. వారి నిర్ణయాలను అమలు చేయాల్సిన బాధ్యత బ్యూరోక్రాట్స్ ది.

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## సంపాదకీయం

### ఓ వైపు జాతీయ వాదం..

# మరో వైపు విభజనవాదం

భారతదేశం ప్రస్తుతం రెండు వ్యతిరేక దిశల్లో పయనిస్తోంది. ఒకవైపు జాతీయవాద భావనలు బలపడుతుండగా, మరోవైపు విభజన శక్తులు కూడా ఊపందుకుంటున్నాయి. ఈ విరుద్ధతలు సమాజంలో ఉద్రిక్తతలను పెంచుతున్నాయి.దేశవ్యాప్తంగా జాతీయవాద భావనలు పటిష్టమవు తున్నాయి. విద్యా సంస్థల్లోనూ ఈ పోకడ స్పష్టంగా కనిపిస్తోంది. దక్షిణాది నుంచి ఉత్తరాది వరకు, ప్రముఖ యూనివర్శిటీల్లో జాతీయ భావనలతో కూడిన సంఘాలు విజయాలు సాధిస్తున్నాయి. ఇది కేవలం విద్యార్థి రాజకీయాలకే పరిమితం కాదు.. స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీలు మరియు పార్లమెంటరీ ఎన్నికల్లో కూడా జాతీయవాద పార్టీలు తమ ఆధిక్యతను నిరూపిస్తున్నాయి. అంతేకాకుండా, ధార్మిక జాగృతి ఒక ఉద్యమ రూపం దాలుస్తోంది. ఆలయ పర్యటనలు పెరుగుతున్నాయి, భక్తుల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందుతోంది. ఈ ధోరణి సమాజంలో ఐక్యతను ప్రోత్సహిస్తుంది, కానీ దీనిని విచ్ఛిన్న శక్తులు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. జాతీయవాదం బలపడటం దేశ ఐక్యతకు బలమిస్తుంది, అయితే ఇది అతివాద రూపాలు దాల్చకుండా చూడాలి.జాతీయవాదం పెరుగుతున్నప్పటికీ, దీనికి విరుద్ధంగా కులం, మతం ఆధారిత విభజనలు కూడా బలపడుతున్నాయి. రాష్ట్ర స్థాయి, జాతీయ ఎన్నికల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా సమాజాన్ని చీల్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది కేవలం రాజకీయాలకే పరిమితం కాదు.. సామాజిక స్థాయిలో కూడా విష సంస్కృతిని ప్రోత్సహిస్తోంది. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలు చిన్న పట్టణాలకు విస్తరిస్తున్నాయి. గతంలో పెద్ద నగరాలకే పరిమితమైన ఈ సమస్య, ఇప్పుడు గ్రామీణ మరియు చిన్న పట్టణాల్లోనూ వ్యాపిస్తోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు డిజిటల్ మాధ్యమాల ద్వారా విధ్వంసకర చర్యలకు పాల్పడుతున్నట్లు బయటపడుతోంది. ఈ విభజనలు సమాజ ఐక్యతను బలహీనపరుస్తాయి. ఇవి దీర్ఘకాలిక సవాళ్లను సృష్టిస్తాయి.దేశంలో మత ఆధారిత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ప్రముఖ నగరాల్లో విదేశీ భావనలతో కూడిన నినాదాలు, చిహ్నాలు కనిపిస్తున్నాయి, ఇది దేశీయ ఐక్యతకు హానికరం. కొన్ని న్యాయస్థానాల తీర్పులు ఇలాంటి చర్యలకు మార్గం సుగమం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఫలితంగా అల్లర్లు, హింసాత్మక సంఘటనలు పెరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో ఈ సమస్యలు తీవ్రమవుతున్నాయి. మత సంబంధిత చిహ్నాలు నినాదాలు హింసకు దారితీస్తున్నాయి. స్థానిక సంస్కృతి, పండుగలపై అభ్యంతరాలు లేవనెత్తడం ద్వారా ప్రభుత్వాలు కూడా జోక్యం చేసుకోవాల్సి వస్తోంది. ఈ ధోరణి మత సామరస్యాన్ని దెబ్బతీస్తుంది.. సమాజంలో భయాందోళనలను పెంచుతుంది.ఈ విద్వేషాల వెనుక కొన్ని విచ్ఛిన్నకర గ్రూపులు, బయటి ప్రభావాలు ఉన్నట్లు కనిపిస్తోంది. పొరుగు దేశాల్లో రాజకీయ మార్పులు జరిగిన తరహాలో, భారతదేశంలో కూడా ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. చిన్న గ్రూపులు స్థానిక స్థాయిలో ప్రభావం చూపుతూ, జాతీయ ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. చారిత్రక ఘటనల సమయంలో కూడా ఇలాంటి నినాదాలు, చర్యలు కనిపిస్తున్నాయి, ఇది ఒక వ్యూహాత్మక ప్యాటర్న్‌ను సూచిస్తుంది. ఈ గ్రూపులు సమాజాన్ని విభజించడం ద్వారా దేశ స్థిరత్వాన్ని దెబ్బతీయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ప్రభావాలు దీర్ఘకాలంలో దేశ భద్రతకు ముప్పు కలిగిస్తాయి.జాతీయవాదం, విచ్ఛిన్న శక్తుల మధ్య ఈ సంఘర్షణ దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఐక్యతను పటిష్టం చేస్తూ, విభజనలను అరికట్టడం అవసరం. లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించినప్పుడు స్థానికులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. అయితే కొద్ది కాలంలోనే రాష్ట్ర హోదా కోసం డిమాండ్ ప్రారంభమైంది. ఇది సహజసిద్ధమైన స్థాని క హక్కుల పోరాటం కాకుండా, ప్రణాళికబద్ధమైన రాజకీయ తద్వారా అంతర్జాతీయ దష్టి ఆకర్షించాలనే ప్రయత్నం అని చెప్పవచ్చు. మెగసెసె అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చూ, ఈ ఉద్యమానికి ప్రధాన నాయకుడిగా ఎదిగారు. ఆయన నడిపిన సంస్థలకు లైసెన్స్ రద్దు కావడమే మొదటి ఘర్షణ. వాంగ్‌చూ తండ్రి కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి కావడం వలన ఆయన రాజకీయ నేపథ్యం కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన అంశం. ఆయన సంస్థలకు ఇచ్చిన భూమి లీజు రద్దు తరువాత ఆయన క్రమంగా రాష్ట్ర హోదా ఉద్యమం మొదలు పెట్టారు. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే ? ఒక విద్యా, సాంస్కృతిక కార్యకర్త ఒక్కసారిగా ఎందుకు హింసాత్మక ఉద్యమానికి పూనుకుంటారు? సమాధానం ? ఒకవైపు వ్యక్తిగత నష్టం, మరోవైపు రాజకీయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్న వ్యూహం.లడఖ్ ఉద్యమాన్ని కేవలం స్థానిక అసంతృప్తిగా చూడటం తేలికైన నిర్ణయమే అవుతుంది. వాంగ్‌చూ ప్రసంగాలు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన అల్లర్ల తీరును పోలి ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇక అరెస్ట్ అయిన వారిలో కొందరు నేపాల్‌కు చెందినవారు కావడం కూడా ఈ వాదనను బలపరుస్తోంది. చిన్నచిన్న ప్రాంతాల్లో హింస చెలరేగించడం ద్వారా ప్రపంచ మీడియా అటెన్షన్ పొందాలన్న గ్లోబల్ ప్రొటెస్టు మోడల్ ఇక్కడ ప్రయోగించినట్లు కనిపిస్తోంది.ప్రభుత్వాలు, సమాజం, విద్యా సంస్థలు కలిసి ఈ సవాళ్లను ఎదుర్కోవాలి. విచ్ఛిన్నకర శక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే సమతుల్యమైన సమాజాన్ని నిర్మించవచ్చు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదు.. సామాజిక బాధ్యత కూడా..!

### ఎక్కడ తగ్గాలో..

# తెలిసిన నేత చంద్రబాబు



విజయవాడ, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన నేత. ఆయన పార్టీని గత నాలుగు దశాబ్దాల నుంచి ఒంటిచేత్తో నడిపిస్తున్నారు. నాలుగుసార్లు అధికారంలోకి తేగలిగారు. కూటమితో నెగ్గారని కొందరు విమర్శించవచ్చు కానీ, ఆ కూటమిలోని మిత్ర పక్షాల ఇగోలను సంతృప్తి పరుస్తూ, వారు నొచ్చుకోకుండా నిర్ణయాలు తీసుకుంటూ తాను అనుకున్న పనులు చేసుకుంటూ ముందుకు వెళ్లే నేతల్లో చంద్రబాబు నాయుడు ముందుంటారు. ఎందుకంటే చంద్రబాబు నాయుడుకు రాజకీయాలు ఎలా ఉంటాయో తెలుసు. తమ బలం.. ఎదుటి వారి బలహీనత.. ప్రత్యర్థికి అందిపుచ్చుకునే అవకాశం ఇవ్వకపోడం వంటి వాటిల్లో చంద్రబాబును మించిన నాయకుడు మరొకరు ఉండరు. నిజానికి ఎన్నడూ లేనిది కూటమి ప్రభుత్వానికి అధినేతగా ఉన్న చంద్రబాబు నాయుడు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తన పరిధిలో ఉన్నంత వరకూ కూటమిలోని మిత్ర పక్షాలకు తగిన గౌరవంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాలుగా పదవులు ఇవ్వడంలో చంద్రబాబు నాయుడు వెనకాడరు. కేంద్ర ప్రభుత్వంలో అధికారాన్ని పంచుకున్నా మోదీని ఇబ్బంది పెట్టకుండా తన మద్దతు అవసరం అని తెలిసినప్పటికీ కేవలం రెండు కేంద్ర మంత్రి పదవులతోనే సరిపెట్టుకున్న చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి అవసరమైన నిధులను, ప్రాజెక్టులను తేవడంలో కొంత సక్సెస్ అయ్యారు. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరగాలంటే కేంద్రంతో కయ్యం కంటే స్నేహం మంచిదని భావించి గొంతెమ్మ కోరికలకు పోకుండా తగ్గి ఉంటూ అన్నీ తెచ్చుకుంటున్నారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన పరిణామాలకు చంద్రబాబు నాయుడు బాధ్యుడు కారు. బొండా ఉమామహేశ్వరరావు కానీ, నందమూరి బాలకృష్ణ కానీ చేసిన వ్యాఖ్యలు కూటమిలోని మిత్రపక్షాలను ఇబ్బందిపెట్టే విధంగా ఉన్నాయి. అందుకే చంద్రబాబు నాయుడు తానే నడుంబిగించారు. నిన్న మధ్యాహ్నం మూడు గంటలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇంటికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్లారు. వైరల్ ఫీవర్ బాధపడుతూ హైదరాబాద్ లోని తన నివాసంలో ఉన్న పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, నందమూరి బాలకృష్ణ చిరంజీవి పై చేసిన కామెంట్స్ పై కూడా ఆయన వివరణ ఇచ్చినట్లు తెలిసింది. పవన్ కల్యాణ్ మనసు నొచ్చుకోకుండా చంద్రబాబు తగ్గి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఏడు పదులు దాటిన వయసులో ఆయన తనవద్దకు రావడంతో పవన్ కల్యాణ్ కూడా కూల్ అయినట్లు తెలిసింది. దటీజ్ చంద్రబాబు.

**రికార్డుల నుంచి తొలగింపు**

హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తాను చేసిన వ్యాఖ్యలను సాధారణ కామెంట్స్ గానే తీసుకున్నారు. పైగా తాను అన్నదాంట్లో తప్పేముందని ప్రశ్నించినట్లు తెలిసింది. తాను ఉన్న మాటలే మాట్లాడానని, అక్కడ జరిగిన విషయాన్ని కొందరు సభ్యులు సభతో పాటు ప్రజలను తప్పుదోవ పట్టిస్తుంటే తాను ఉండబట్టలేక నిజం చెప్పాల్సి వస్తుందని టీడీపీ నాయకత్వం ముందు తన వాదనను వినిపించినట్లు సమాచారం. వాస్తవానికిశాసనసభలో బాలయ్యచేతనే తాను చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నం చేశారని తెలిసింది. అయితే అందుకు బాలకృష్ణ అంగీకరించలేదని పార్టీ నేతలు ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు.అందుకే ఇక కామినేని శ్రీనివాస్ చేత శాసనసభలో జీరో అవర్ లో ఇటీవల తన సభలో ప్రస్తావించిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిప్యూటీ స్పీకర్ ను కోరారు. తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి కనుక ఆ వ్యాఖ్యల సందర్భంగా జరిగిన వ్యాఖ్యలను రికార్డులనుంచి తొలగించాలని టీడీపీ నాయకత్వం కామినేని శ్రీనివాస్ చేత చెప్పించినట్లు తెలిసింది. దీంతో కామినేని శ్రీనివాస్ విజ్ఞప్తితో సభలో చేసిన వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించారు. మొత్తం సినీరంగంపై చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించారు. రికార్డుల నుంచి సినీరంగంపై వ్యాఖ్యల తొలగింపును జనసేన పార్టీ కూడా స్వాగతించడం విశేషం. అంటే బాలకృష్ణ చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. మరొకవైపు సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా నందమూరి బాలకృష్ణ ఎవరినీ అవమానించలేదని అన్నారు. గత ప్రభుత్వంలో నలిగిన ప్రతి సినిమా వాడి కోసం ఆయన గళమెత్తారన్నారు. ఆ ఆవేశం ఎవరిమీద కాదు.. టాలీవుడ్ గౌరవం కోసమేనని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బాలకృష్ణను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. అయితే బాలకృష్ణ వ్యాఖ్యలు అప్పటికే రాజకీయదుమారం కావడంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటనచేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఒక టీమ్ అని, టీమ్‌లో ఏ ఒక్కరు తప్పు చేసినా చాలా నష్టం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు పర్సనల్ అజెండాలు పెట్టుకుని మాట్లాడితే మన లక్ష్యానికి విఘాతం కలుగుతుందని అన్నారు. నందమూరి బాలకృష్ణ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోబోనని చెప్పడంతోనే కామినేనిని సహకారంతో ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. తాను కూడా సభలో అందరితో పాటు బాలకృష్ణకు కూడా పరోక్షంగా వార్నింగ్ ఇచ్చినట్లయిందని అంటున్నారు.

# 16న నంద్యాలకు మోడీ



కర్నూలు, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: నరేంద్ర మోడీ ఏపీ పర్యటనకు రానున్నారు. ఇందుకు సంబంధించి షెడ్యూల్ కూడా ఖరారు అయింది. అక్టోబర్ 16న కర్నూలు జిల్లా నంద్యాలలో పర్యటించనున్నారు. శ్రీశైలం ఆలయాన్ని సందర్శించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. పురావస్తు శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రధాని పర్యటన నేపథ్యంలో సర్ప్రైజ్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అదే రోజు కూటమినేతలతో కలిసి ప్రధాని రోడ్ షోలో పాల్గొంటారు. దీంతో ప్రధాని పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది రాష్ట్ర ప్రభుత్వం. పక్కాగా ప్లాన్ చేస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అనేక కొత్త అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారు. ఇప్పటికే పూర్తయిన కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులను కూడా ప్రారంభిస్తారు.శ్రీశైలం పుణ్యక్షేత్రానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆ చరిత్రను వివరించేందుకు పురావస్తు శాఖ ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందిస్తోంది. శ్రీశైలం చారిత్రక ప్రాధాన్యాన్ని ఆయనకు వివరించేందుకు పురావస్తు శాఖ అధికారులు ఒక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. సీఎం కార్యాలయ ఆదేశాల మేరకు తామ్ర శాసనాలతో ఈ ప్రదర్శనను సిద్ధం చేస్తున్నారు. 2021లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా శ్రీశైలం వచ్చినప్పుడు కూడా ఇలాంటి ప్రదర్శనను ఏర్పాటు చేశారు. శ్రీశైలం ఆలయంలో క్రీస్తు శకం 13వ శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వరకు లభించిన అనేక తామ్ర శాసనాలు ఉన్నాయి. ఈ శాసనాలు ఆలయ చరిత్రను వివరిస్తాయి. వాటి గురించి ప్రధాని నరేంద్ర మోడీకి వివరించనున్నారు పురావస్తు శాఖ అధికారులు.అప్పట్లో శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని రాజులు సందర్శించేవారు. భారీగా విరాళాలు ఇచ్చేవారు. వాటి వివరాలను రాగి రేకులపై రాసేవారు. ఆలయం పై దాడులు జరిగినప్పుడు, మళ్లీ ఆలయ పునరుద్ధరణ జరిగిన సందర్భాలను కూడా ఈ శాసనాల్లో పొందుపరిచారు. తోకచుక్కలు భూమిపై పడిన సంఘటనలను సైతం ఈ తామ్ర శాసనాల్లో ప్రస్తావించారు. మొత్తం 20 తామ్ర శాసనాల గుత్తులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వాటిలో 79 రాగిరేకులు కూడా ఉన్నాయి. ఈ శాసనాలు తెలుగు, సాంస్కృతం, దేవనగరి, హిందీ, ఉర్దూ భాషల్లో ఉన్నాయి. ఇప్పటికే ఈ శాసనాల వివరాలతో భారత పురావస్తు సంచాలకులు మునిరత్నం రెడ్డి ఒక పుస్తకం కూడా రాశారు. కాగా ప్రధాని పర్యటనలో భాగంగా రోడ్ షో ఉంటుంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో కలిసి ప్రధాని ఈ రోడ్ షోలో పాల్గొంటారు.

# సహాయ నిరాకరణలో సచివాలయ ఉద్యోగులు



ఒంగోలు, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: ఏపీలో ఉద్యోగుల సంక్షేమం కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదా? వార్డు-గ్రామ సచివాలయ ఉద్యోగులు పోరుబాటకు రెడీ అవుతున్నారా? దీని వెనుక అసలేం జరిగింది? వారి సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడమే కారణమా? అక్టోబర్ ఒకటిన పింఛన్లు పంపిణీకి దూరంగా ఉండాలని ఉద్యోగులు డిసైడ్ అయ్యారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఏపీలో ఏడాదిగా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయంటే అందుకు కారణం వార్డు-గ్రామ సచివాలయ ఉద్యోగులు. ఇప్పుడు ఆ ఉద్యోగులు పోరుబాటకు సిద్ధమయ్యారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అయ్యారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు జేఏసీగా ఏర్పడ్డారు. అంచెలంచెలుగా కార్యాచరణను మొదలుపెడుతున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ ఉద్యోగులు పోరుబాటకు సిద్ధమయ్యారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోనున్నారు. తాజాగా అందుకున్న సమచారం మేరకు చాలా జిల్లాల్లో ఉద్యోగులు వాట్సాప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ అయినట్టు తెలుస్తోంది. ఒకవిధంగా చెప్పాలంటే ఇదొక సహాయ నిరాకరణగా చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామ-వార్డు సచివాలయం కేంద్రంగా సుమారు 13 శాఖలకు సంబంధించిన పని చేస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చిన నుంచి ఇప్పటివరకు పైస్థాయి అధికారులు మెల్ల మెల్లగా ఆ ఉద్యోగులపై పని భారం పెంచే ప్రయత్నం చేశారు.. చేస్తున్నారు కూడా. కేవలం మాతృ శాఖ పనులు కాకుండా డోర్ టూ డోర్ సర్వేలు చేయిస్తున్నారుసర్వేల పేరుతో ప్రతీ ఇంటికి వారానికి రెండుమూడు సార్లు వెళ్తున్నట్లు చెబుతున్నారు. దీనివల్ల చాలామంది ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. పింఛన్ల పంపిణీ వ్యవహారం కత్తి మీద సాముగా మారింది. ఉదయం ఏడు గంటలకు పింఛన్ల పంపిణీ అయితే తెల్లవారుజాము నుంచే పైస్థాయి అధికారులు ఫోన్లు చేసి ఫీల్డ్‌లో ఉన్నారా? లేరా అంటూ వేధించడం మొదలుపెడుతున్నారని చెబుతున్నారు. నెట్ సదుపాయాలు లేని ప్రాంతాల్లో తమకు తెలీదు.. ఏదో ఒకటి చేయాలంటూ ఉద్యోగులపై పైస్థాయి అధికారులు ఒత్తిడి చేస్తున్నారట. పింఛన్ల పంపిణీ పూర్తి కాగానే, ఆఫీసుకొచ్చి పెండింగ్‌లో ఉన్న పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. పంచాయతీ సెక్రటరీల నుంచి ఎంపిడిఓలు, ఆ తర్వాత అన్ని శాఖల అధికారుల అజమాయిషీ కొనసాగడంపై తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఇతర శాఖల అదనపు పనులు తప్పించాలని చాన్నాళ్లుగా వేడుకుంటున్నారు. అలాగే తమకు ఇచ్చే వేతనాలు మాతృ సంస్థ చెల్లించేలా పలు డిమాండ్లతో రాష్ట్ర స్థాయిలో కార్యాచరణ రెడీ చేశారు. ఈ నేపథ్యంలో దశలవారీగా ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారట. ఈనెల 29 అంటే సోమవారం లోపు చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. లేకుంటే అక్టోబర్ ఒకటిన సామాజిక పింఛన్లను పంపిణీ చేయబోమని ఇప్పటికే ఆ ఉద్యోగుల జేఏసీ నోటీసు ఇచ్చింది. అంతేకాదు కొన్ని జిల్లాల్లో సిబ్బంది ఇప్పటికే తమ నిరసన వ్యక్తం చేస్తూ అధికారిక వాట్సాప్ గ్రూప్ నుంచి ఎగ్జిట్ అవుతున్నారు. ఈ లెక్కన అక్టోబరు ఒకటిన పింఛన్ల మాటేంటన్నది అసలు ప్రశ్న. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకోకుండే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని అంటున్నారు

## సాంప్రదాయాలకు నిలువుటద్దం దేవరెద్దు ఎంపిక



మదనపల్లె, సూర్య వాస్తవం, సెప్టెంబరు 30: అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మండలంలో దేవర ఎద్దు ఎంపిక సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు సనాతన ధర్మానికి అద్దం పట్టింది. పట్టణ ప్రజలు సాంప్రదాయాలను పాటించక పోయినప్పటికీ, పల్లెల్లో అక్కడక్కడా సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలు ఇంకా బతికే ఉన్నాయని నిరూపిస్తున్నారు. ఈ క్రమంలోనే టేకులపాళ్యంలో ఇటీవల ఆ గ్రామస్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజి స్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి అవతారంగా భావించే దేవరెద్దు మృతి చెందడంతో, తిరిగి ఆ ఎద్దు స్థానాన్ని భర్తీ చేయడానికి మంగళవారం పండుగ వాతా వరణంలో దేవర ఎద్దును ఎంపిక చేశారు.



## ఐదు కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు



లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, సెప్టెంబరు 30: గాలివీడు మండలం అరబీటివాళ్లపల్లి సమీపంలో ఐదు మంది వ్యక్తులు గంజాయిని విక్రయిస్తుండగా మంగళవారం దాడులు చేసి వారి వద్ద నుంచి 5.5 కిలోల గంజాయి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ మురళి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలంలో దాడులు నిర్వహిస్తుండగా ధనియాల రఘు ఆవుల అంజి ధనియాల రాజశేఖర్ చందు జుంటుగింది శ్రీనివాసులు అనే వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. గంజాయి నాటు సారా అక్రమ మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎవరైనా నాటు సారా తయారు చేస్తే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలన్నారు. సమాచారం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ వన్14405 నెంబర్ కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీకేఎస్ సింగిల్ విండో ప్రెసిడెంట్‌పై వేట కొడవళ్లతో దాడి





అనంతపురం క్రైం, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: బుక్కరాయసముద్రం సింగిల్ విండో ప్రెసిడెంట్ కేశన్నపై గుర్తుతెలియని వ్యక్తులు వేట కొడవళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. తనపై దుండగులు విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారని బాధితుడు కేశన్న వాపోయారు. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వాహనాల తనిఖీలు



పుట్టపర్తి, సూర్యవాస్తవం, సెప్టెంబర్ 30: జిల్లా ఎస్పీఆదేశాల మేరకు మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు,రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు, రాత్రి గ్రామాలను పోలీసు అధికారులు సందర్శించి నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు,పట్టణ ప్రధాన రహదారులలో విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో కేసులు బాల్య వివాహాలు, సైబర్ మోసాలు, చట్టాలపై అవగాహన, గ్రామాలలో పౌరహక్కు దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించి రాజ్యాంగంలో కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు. డయల్ 112: అత్యవసర సహాయం కోసం. చైల్డ్ లైన్ 1098: పిల్లల సమస్యల కోసం, గృహ హింస 181: గృహ హింసకు గురైనవారికి. మహిళ వేధింపులు 1091: మహిళల వేధింపుల కోసం, సైబర్ టోల్‌ఫ్రీ 1930:సైబర్ నేరాలు, 30 పోలీస్‌యాక్ట్‌పై అవగాహన కల్పించడం తోపాటు, ప్రజల భద్రత భరోసా కల్పిస్తూ విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు.

# ఓటును కాపాడుకుందాం

### ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

### ఓటుచోరి వ్యతిరేక ఉద్యమానికి మద్దతివ్వండి - కాంగ్రెస్ నేత తులసిరెడ్డి



మదనపల్లె, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: ఓటును కాపాడుకుందాం, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం. దేశంలో ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు మంగళవారం మదనపల్లె టౌన్ బెంగళూరు బస్టాండు, ఇందిరమ్మ సర్కిల్ వద్ద ఎస్.రెడ్డీ సాహెబ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమానికి ప్రజల నుంచి మద్దతు లభించింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఎన్.తులసి రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అవమానపరుస్తూ ప్రజల ఓటు హక్కును దోచుకుంటోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ప్రశ్నిస్తున్న వారి ఓట్లను గల్లంతు చేస్తూ లేని వారి ఓట్లను జాబితాలోకి ఎక్కించి దొంగ ఓట్లతో మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. దీనిని అరికట్టడానికి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేయడం హర్షణీయమన్నారు. ఉద్దేశ పూర్వకంగా ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్న అధికారులు, ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమానికి ప్రజలు మద్దతు తెలిపి భాగస్వాములు కావాలని, తమ ఓటు హక్కును కాపాడుకుంటూ బిజెపి అరాచకాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి అనుసరిస్తున్న ఓటు చోరీతో ప్రజల రాజ్యాంగ హక్కులు కాలరాయబడు తున్నాయని విమర్శించారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, తనకు అనుకూలమైన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకుంటోందని దుయ్యబట్టారు. దీనిని ప్రజలు క్షమించరని, దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. దేశంలో ఓటర్ల జాబితాలో స్పష్టమైన ఫోటోలతో ఓటరు వివరాలు ఉండాలని, ఎన్నికల ముందు ఓటరు జాబితాలో చేసే మార్పులు చేర్పులకు సంబంధించిన పూర్తి వివరాలను బహిరంగంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు మీనా కుమారి, నిమ్మనపల్లె పార్టీ అధ్యక్షులు ముబారక్, టౌన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహబూబ్ పీర్, నాగరాజు, పాలేటి, రాజశేఖర్ నాయక్, భాను, సోమశేఖర్, కరామత్ బాషా, సీటీఎం రవి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం: జిల్లా కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం మరియు అభివృద్ధికి కట్టుబడి ఉందనీ మరియు సమాజంలోని పేద మరియు బలహీన వర్గాల, ముఖ్యంగా వృద్ధులు మరియు అస్వస్థత, వితంతువులు వారి కష్టాలను తీర్చడానికి పెన్షన్ మొత్తాన్ని పెంచడం అనేది ఒక ప్రధాన సంక్షేమ చర్య, వైకల్యం ఉన్న వ్యక్తులకు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్య కారులు, డప్పు కళాకారులు, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాదిగ్రస్తులు మరియు ధీర్ఘకాల వ్యాదిగ్రస్తులు మొదలైన వారికి గౌరవప్రదమైన జీవితాన్ని మరియు వారిని సురక్షితంగా ఉంచడానికి కట్టుబడి ఉంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2025 నెలకు సంబంధించి అనంతపురము జిల్లాలో 2,79,933 పించనుదారులకు రూ.124.77 కోట్లు ప్రభుత్వ నిధులు విడుదల చేయబడిన వనీ, అక్టోబర్ నెల పెన్షన్లను 1వ తేదీన పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. అక్టోబర్ నెలకు సంబంధించి అక్టోబర్ 1వ తేదిన పించను పంపిణి ఉదయం 7.00 గంటలకు గ్రామ మరియు వార్డ్ సచివాలయ సిబ్బంది ద్వారా పించను దారుని ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేయబడుతుంది. పించనుదారులు అక్టోబర్ 1వ తేదిన తమ తమ ఇంటి దగ్గరే ఉండి పించను మొత్తాన్ని పొందగలరని కోరడమైనది. ఎవరు కూడా పింఛను కొరకు సచివాలయాలకు గాని మరియు ఏ ఇతర కార్యాలయాలకు వెళ్ళవలసిన అవసరం లేదు. మొదటిరోజే పించనుదారులందరికి పించను పంపిణీ చేస్తారు. ఎవరైతే మొదటి రోజు ఏదేని కారణం చేత పించను పొందలేదో వారికి రెండవ రోజు అనగా 02.10.2025 తేదీన గాంధీ జయంతి సెలవు దినము అయినందున పించను పంపిణీ 03.10.2025 తేదీన జరుగుతుంది. పించనుదారులు ఈ మార్పును గమనించి, 03.10.2025 తేదీన సచివాలయము దగ్గరకు వెళ్లి మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు పించను పొందవచ్చునని కలెక్టర్ తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య



మదనపల్లె, సూర్య వాస్తవం, సెప్టెంబరు 30: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ లక్ష్మీనరసయ్య తెలిపారు. మంగళవారం ఆయన మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలోని పిపి యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్ల ను పరిశీలించి, యూనిట్‌లో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, డయేరియా వంటి వ్యాధుల నివారణకు శుభ్రత పాటించాలని, తాగునీటిని మరిగించి వాడాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని వివరించారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఉచిత వైద్య సేవలు, మందులు తీసుకుని, అవసరమైన పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, కేసులు వెలుగులోకి వచ్చిన వెంటనే తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో సిబ్బంది పాత్ర ఎంతో ముఖ్యమని, సమయానికి చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చునని తెలిపారు. క్షేత్ర స్థాయిలో డాక్టర్లు, హెల్త్ సిబ్బంది జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు (టీబి నిర్మూలన, ఎన్.టి.ఇ.పీ., మలేరియా నిర్మూలన, లేప్రసి వ్యాధి నియంత్రణ మొదలైనవి), రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా అధిగ మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. శ్రీధర్, టిబి సూపర్ వైజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు మేధోసంపత్తిని పెంపొందించుకోవాలి



మదనపల్లె, సూర్య వాస్తవం, సెప్టెంబరు 30: విద్యార్థులు మేధోసంపత్తిని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.రమణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సంఘం ఫంక్షన్ హాల్‌లో పివికె ఫౌండేషన్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ డాక్టర్ మర్రిపాటి రమేష్ ఆధ్వర్యంలో 2025 లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కురుబ విద్యార్థులు, ఉద్యోగులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.రమణ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిటైర్డ్ గ్రూపు కెప్టెన్ డాక్టర్ పరంధామయ్యగౌడ్, డాక్టర్ చెన్నకేశవులు, రిటైర్డ్ డిగ్రీ లెక్చరర్ ఆదినారాయణ,దండు రామాంజులు వాల్మీకిపురం ఎస్ఐ చంద్రశేఖర్, డాక్టర్ గంగయ్య, రెడ్డెప్ప, కుమార్, మల్లికార్జున తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కురుబ విద్యార్థులు అత్యున్నత ప్రమాణాలతో విద్యాభ్యాసం చేసి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఉన్నత స్థితికి చేరుకున్న తరువాత తమను ఆదరించిన తమతోటి సామాజిక వర్గ భావితరాల పిల్లల భవిష్యత్తు కొరకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సామాజికస్పృహతో సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్య, ఉద్యోగాలలో ప్రతిభ కనబర్చిన 150మందికి ప్రతిభా పురస్కారాలను అందించి, దుశ్శాలువా, మొమెంటో, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పివికె ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ మర్రిపాటి రమేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా గ్రామీణప్రాంత విద్యార్థులకు విద్యాపరంగా అవసరమైన సలహాలు సూచనలు ఇస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవడానికి విశేషంగా కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలకర్ణ , సాంబశివ, శివ, ప్రతాప్ పలువురు కురబసంఘ నాయ కులు, కుల బాంధవులు, విద్యార్థులు, ఉద్యోగులు, పలువురు పాల్గొన్నారు.

## జన సైనికుడికి 15వేల ఆర్థిక సాయం



గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: హార్ట్ బ్లడ్ వ్యాధితో బాధపడుతున్న గోరంట్ల మండలం జనసైనికుడు శ్రీరాములును గోరంట్ల మండలం జనసేన నాయకులు పరామర్శించారు, అనంతరం తమ వంతు సాయంగా 15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, జిల్లా కార్యదర్శి సురేష్ ,జిల్లా సంయుక్త కార్యదర్శి చిలమతూరు వెంకటేష్, జిల్లా కార్యక్రమాల కమిటీ మెంబర్ పోగతోటి వెంకటేష్, గొల్ల అనిల్ యాదవ్ , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నరేష్ ,సింగిల్ విండో డైరెక్టర్ గుంటిపల్లి నాగేష్, బూదిలి సింగిల్ విండో డైరెక్టర్ నవీన్, స్కూల్ చైర్మన్ తిరుపాల్, బూదిలి పవన్ కుమార్, గొల్లపల్లి రమేష్ యాదవ్, గాజుల రమేష్, శ్రీనివాసులు, గోవిందప్ప, నాగభూషణ, మలసముద్రం రామాంజి , తదితరులు పాల్గొన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in



# మనసున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

- సౌదీలో చిక్కుకున్న నిజాంను వారం రోజుల్లో అనంతపురంకి తీసుకొస్తాం
- ఆజాద్ నగర్‌లోని నిజాం ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శ
- కుటుంబానికి సీఎంఆర్ఎఫ్, సొంత ఇల్లు ఇస్తామన్న ఎమ్మెల్యే
- వీడియో కాల్ ద్వారా నిజాంకు ఎమ్మెల్యే దగ్గుపాటి,
- మంత్రి నారా లోకేష్ కార్యాలయం సిబ్బంది పరామర్శ





అనంతపురం క్రైం, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లి అక్కడ చిక్కుకున్న అనంతపురం కు చెందిన నిజాంను వారం రోజుల్లో స్వస్థలానికి చేరుస్తామని.. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని ఆజాద్ నగర్ కు చెందిన నిజాం రెండు నెలల క్రితం ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లారు. అక్కడ ఓ ఇంట్లో డ్రైవర్ గా చేరిన తర్వాత వేధింపులు మొదలయ్యాయి. ఓనర్లు నిత్యం దాడి చేస్తూ చిత్రహింసలకు గురి చేశారు. చివరకు అతన్ని బయటికి నెట్టివేయడంతో సౌదీ లో కనీసం తినేందుకు తిండి కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు ఒక వీడియో సందేశం ద్వారా తన ఆవేదనను వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి తనను రక్షించాలని వేడుకున్నారు. ఈ వీడియో వైరల్ గా మారడంతో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెంటనే స్పందించారు. నగరంలోని ఆజాద్ నగర్ లో ఉన్న నిజాం ఇంటికి టిడిపి నాయకులతో కలసి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిజాం సతీమణి రేష్మ కు ధైర్యం చెప్పారు. వెంటనే తన స్నేహితుల ద్వారా సౌదీలోని జెడ్డాలో ఉన్న నిజాంను కలిసేలా చేశారు. అనంతరం వారి ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలుగు అసోసియేషన్ వారికి నిజాంను అప్పజెప్పారు. జెడ్డా నుంచి సౌదీ రాజధాని రియాద్‌కు నిజాంను తీసుకొచ్చారు. అక్కడ నుంచి అనంతపురం తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని అంశాలు అధికారులతో మాట్లాడారు. అయితే నిజాం ఎందుకు సౌదీకి వెళ్లారన్నా అంశాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరా తీశారు. గతంలో పదేళ్లపాటు సౌదీలో డ్రైవర్ గా పని చేసే వారని.. తిరిగి అనంతపురంవచ్చి ఇక్కడే ఉన్నారని తెలిపింది. ఇటీవల తమ కుమారుడికి కిడ్నీ ఆపరేషన్ చేయడంవలన 12లక్షల రూపాయలు అప్పులు అయ్యాయన్నారు. వీటిని తీర్చేందుకు మళ్లీ రెండునెలల క్రితం ఆయన సౌదీకి వెళ్లినట్లు వివరించారు. ఈ సంఘటనపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి వైద్య ఖర్చులకు అయిన సొమ్మును సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే సొంత ఇల్లు కూడా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నిజాం ఇబ్బందుల గురించి తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో బిజీగా ఉన్నప్పటికీ తన కార్యాలయ సిబ్బందిని చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే లోకేష్ కార్యాలయ సిబ్బంది కూడా నిజాంతో మాట్లాడారని ఎమ్మెల్యే తెలిపారు. కచ్చితంగా అతన్ని వారం రోజుల్లోపు అనంతపురం తీసుకొస్తామని వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గౌస్ మోద్దీన్, రాయల్ మధు, సరిపుటి రమణ, సుధాకర్ యాదవ్, నారాయణ స్వామి యాదవ్, బొమ్మినేని శివ, తాజుద్దీన్,జనబలం బాబా, ఫిరోజ్ అహ్మద్, చేపల హరి, ఇస్మాయిల్, పూల భాష, ఓంకార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం





చెన్నూరు, సూర్య వాస్తవం సెప్టెంబర్ 30: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని వారి సంక్షేమం కొరకు అనేక పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని ఈ పథకాల గురించి ప్రజలకు పెద్దగా తెలియడం లేదని ఆ సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్దేశంతోనే బిజెపి నాయకులు, కార్యకర్తలు మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ఇంటి ఇంటికి బిజెపి కార్యక్రమంలో భాగంగా బిజెపి మండల అధ్యక్షులు పెదబల్లె వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కొండపేట గ్రామంలో మంగళవారం ఇంటింటికి వెళ్లి అక్కడి ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టినట్టి నటువంటి వివిధ సంక్షేమ పథకాలను గురించి సంపూర్ణంగా వివరించడం జరిగిందని బిజెపి మండల అధ్యక్షులు పెడపల్లి వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి జన్ ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్, గ్రామ ఉజ్వల్ పథకం, మిషన్ కర్మయోగి, డిజిటల్ ఇండియా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, స్వామిత్వ పథకం, ఇలా అనేకపథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రజలు ఈ పథకాలను తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని బిజెపి నాయకులు కార్యకర్తలు కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ అన్ని రంగాలలో ముందుకెళుతున్నదని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ముకుంద రెడ్డి, టీ.ఏ. భరత్ రెడ్డి, శ్రీనివాసులు, మాధవి, ఓబులేష్ చంద్రమోహన్, లక్ష్మీ ప్రసన్న,మండల ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, , గోవిందు గణేష్, చరణ్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు జవాబుదారీతనంగా పనిచేయాలి

## స్వగ్రామంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి








అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లి గ్రామంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల నుండి వచ్చిన ప్రజలు అధికారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే పలువురు అధికారులను ఆదేశించారు. పలు సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కారాన్ని అందించిన మంత్రి గారు ప్రజల్లో విశేష విశ్వాసాన్ని నెలకొల్పారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ పరిష్కారమే ప్రధానంగా...ప్రతి సమస్యకు తక్షణ స్పందన, పరిష్కారమే లక్ష్యం చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు... ఈ సందర్భంగా మంత్రిగారికి పలువురు నాయకులు దుశలవలతో పుష్పగుచాలతో ఘనంగా సన్మానించారు.

**బోరెడ్డిగారిపల్లిలో..:** చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లి గ్రామంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల నుండి వచ్చిన ప్రజలు అధికారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే పలువురు అధికారులను ఆదేశించారు. పలు సమస్యలకు ప్రత్యక్షంగా పరిష్కారాన్ని అందించిన మంత్రి ప్రజల్లో విశేష విశ్వాసాన్ని నెలకొల్పారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ పరిష్కారమే ప్రధానంగా...ప్రతి సమస్యకు తక్షణ స్పందన, పరిష్కారమే లక్ష్యం చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు... ఈ సందర్భంగా మంత్రిగారికి పలువురు నాయకులు దుశలవలతో పుష్పగుచాలతో ఘనంగా సన్మానించారు.







# నేడు లక్కిరెడ్డిపల్లి మండలం టీడీపీ ఆత్మీయ సమావేశం

లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, సెప్టెంబరు 30: నేడు లక్కిరెడ్డిపల్లిలో టీడీపీ మండల క్లస్టర్ కన్వీనర్ యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు యనమల మదన్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రోడ్డు రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఆయన తెలిపారు. మండలంలోని టిడిపి కార్యకర్తలు మండిపల్లి అభిమానులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమం లక్కిరెడ్డిపల్లి లోని పిజిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## మంత్రి సవితమ్మను కలిసిన కలెక్టర్, ఎస్పీ





పెనుకొండ, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: రాష్ట్ర బీసీ, సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మని పెనుకొండలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో మంగళవారం శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఎం.శ్యాం ప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిపై కలెక్టర్‌తో చర్చించారు. అదేవిధంగా శాంతి భద్రతల గురించి ఎస్పీ సతీష్ కుమార్‌తో మాట్లాడి తెలుసుకున్నారు.

## దుర్గాదేవి అలంకరణలో సర్వమంగళదేవి



లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, సెప్టెంబరు 30: మండల కేంద్రంలో లక్కిరెడ్డిపల్లి లోని కొత్తకోటలులో వెలసిన సర్వమంగళ దేవి రామలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా వేడుకల్లో భాగంగా నవరాత్రులు సర్వ మంగళ దేవికి తొమ్మిది రోజులు ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారూ. ఈ సందర్భంగా మంగళవారం సర్వమంగళ దేవి దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ ప్రధాన అర్చకుడు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. చివరి రోజు అమ్మవారు పురవీధులలో ఊరేగింపులు, బాణసంచాలతో కోలాటాలు చెక్కభజనలు డీజే నృత్యాలతో అమ్మవారి ఊరేగింపు చేస్తారు.

## యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దు




చెన్నూరు, సూర్య వాస్తవం. సెప్టెంబర్ 30: యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోరాదని మీ మీద మీ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంటారని అలాంటిది చెడు వ్యసనాలకు బానిసలై మీ జీవితం నాశనం చేసుకోవడమే కాకుండా, మీపై ఆధారపడిన మీ తల్లిదండ్రులతో పాటు కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉందని యువత పెడదారి పట్టరాదని సీఐ ఎం కృష్ణారెడ్డి మంగళవారం చెన్నూరు ప్రధాన కూడళ్లలో "డ్రగ్స్ వద్దు- జీవితం ముద్దు" అనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ పి సచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మండలంలోని పలు కూడలల్లో ఇలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందని సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో యువత డ్రగ్స్ ,గంజాయి వంటి మత్తు పదార్థాలకు ఎక్కువ బానిసలు అయ్యి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని యువకులు మత్తు పదార్థాలు వాడడం వల్ల వారు ఏం చేస్తున్నారో ఏ స్థితిలో ఉన్నారో వారికి తెలియదని మత్తు పదార్థాలు కోవడం ద్వారా వారు గొడవలు, సమస్యల తో పాటు నేరాల బాట పట్టే అవకాశం ఎక్కువగా ఉంటుందని దీనిని అరికట్టేందుకు ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు కూడా ఎంతో అవసరమని ఎవరైనా గజ్జయి, మత్తు పదార్థాలు విక్రయించడం గానీ, లేదా ఎవరైనా యువకులు పదార్థాలు తీసుకునే చోటు గాని తమ దృష్టికి తీసుకురావాలని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలు ఎక్కడికి వెళ్తున్నారు, ఏమి చేస్తున్నారు వంటి వాటిపై దృష్టి పెట్టాలని అలాంటప్పుడే తమ బిడ్డలు ఎలాంటి మత్తు పదార్థాలు బానిసలు కారని, దీంట్లో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో ఉందని ఆయన తెలిపారు. పోలీసులు మండల వ్యాప్తంగా ఇలాంటి బోర్డులు ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు పోలీసుల తీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.


## ప్రత్యేక పూజల్లో నిమ్మల శ్రీధర్






గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: గోరంట్ల మండలం లోని గుమ్మయ్యగారిపల్లి గ్రామంలో వెలసిన మారెమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, పూజారి దేవీ స్వామి ఆహ్వానం మేరకు దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ యజమాని నిమ్మల శ్రీధర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అలాగే దేవస్థానానికి విచ్చేసిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమంను గోరంట్ల నిమ్మల శ్రీధర్ కుటుంబ సభ్యులు నిర్వహించారు. శ్రీధర్ కుటుంబ సభ్యులకు దేవాలయ కమిటీవారు ఘనంగా సత్కరించారు.

## దుర్గాదేవి అలంకరణలో రేణుక ఎల్లమ్మ దేవి



గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: గోరంట్ల పట్టణంలోని పులేరు రోడ్డులో గల నాగుల బావి పక్కన ఈడిగ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం దుర్గాదేవి అలంకరణ లో ప్రత్యేకంగా అలంకరించి, ఈడిగ కులస్తులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను గౌడ సంఘం నాయకులు పంపిణీ చేశారుఈ కార్యక్రమంలో భక్తులు, కులస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రి సవితమ్మకు శుభాకాంక్షలు



గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మరియు చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవితమ్మ దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు అందుకొని, పెనుగొండ నియోజకవర్గం సోమందేపల్లి మండలం బుసయ్య గారి పల్లికి రోడ్డు భూమి పూజ కు విచ్చేసిన శుభ సందర్భంగా సవితమ్మకి బొకే ఇచ్చి పాలసముద్రం సింగిల్‌విండో చైర్మన్ బెల్లాలచెరువు చంద్ర హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు, అలాగే వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి. ఆంజనేయులు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్‌ఎంపీ ఈశ్వరప్పని పరామర్శించిన మాజీ మంత్రి



పెనుకొండ, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: హిందూపురం బాలాజీ హాస్పిటల్ నందు ప్రమాదవశాస్తూ గాయపడి చికిత్స తీసుకుంటున్న పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం మోద పంచాయతీ ఆనందపాల్యం గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఆర్‌ఎంపీ డాక్టర్ కురుబ ఈశ్వరప్పని పరామర్శించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే,మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ మరియు పరిగి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

- డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు వైద్యుల ధర్నా




పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంల వైద్యులు మంగళవారం సత్యసాయి జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వం డిమాండ్లు తీర్చాలని నినాదాలు చేశారు, అనంతరం నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు, ఈ ధర్నా కార్యక్రమానికి శ్రీ సత్య సాయి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు వైద్య సేవలకు దూరంగా ఉంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల సంఘం తో పాటు బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ మద్దతు తెలిపారు. వారితో కలిసి ఆయన సమ్మెలో పాల్గొని వైద్యుల న్యాయమైన డిమాండ్లు తీర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర మాట్లాడుతూ ఎంతో క్లిష్టమైన సమయాల్లో కూడా ప్రజలకు తాము సేవలు అందించామని కానీ ప్రభుత్వానికి తమ డిమాండ్లను తీర్చుడానికి దాస్కారం చేయడం దారుణం అన్నారు. ఇన్ సర్వీస్ పిజీ కోటాను పునరుద్ధరించాలని, టైం బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని, నేషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం గిరిజన బత్యంగా ఇవ్వాలని పలు డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి సైతం తీసుకెళ్లారని, కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఈ నిరవధిక సమ్మెకు దిగడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కూడా తమ డిమాండ్లను తీర్చకపోతే సమ్మెను విరమించేది లేదని తెలిపారు, ఈ కార్యక్రమంలో వైద్యుల సంఘం నాయకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని సన్మానించిన వెంకటరమణారెడ్డి



నాయుడుపేట, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,పార్థసారథి దంపతులను టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి ఘనంగా సన్మానించారు. శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాయుడుపేట పట్టణంలోని గ్రామదేవత శ్రీ పోలేరమ్మకు మంగళవారం ఎమ్మెల్యే దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యే దంపతులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.


# కలెక్టర్ దృష్టికి ధర్మవరం నియోజకవర్గ సమస్యలు

### కలెక్టర్, ఎస్పీలతో పరిటాల శ్రీరామ్ మర్యాదపూర్వక భేటి- చేనేతలు, రైతుల సమస్యలపై కలెక్టర్‌తో చర్చ

పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: ధర్మవరం నియోజకవర్గంలో పలు సమస్యల్ని తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ శ్రీ సత్యసాయి జిల్లా నూతన కలెక్టర్ శ్యాం ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా నూతన



కలెక్టర్, ఎస్పీ వచ్చిన నేపథ్యంలో శ్రీరామ్ వారితో మర్యాద పూర్వకంగా భేటి అయ్యారు. మంగళవారం కలెక్టరేట్ లో కలెక్టర్ శ్యాంప్రసాద్ కు పుష్పగుచ్చాలు అందజేసి జిల్లాకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ధర్మవరం నియోజకవర్గ సమస్యల గురించి చర్చించారు. ముఖ్యంగా చేనేతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఇటీవల వర్షాలకు నష్టపోయిన చేనేత కార్మికులకు పరిహారం, మహిళలకు ఉపాధి కల్పించే అంశాల గురించి మాట్లాడారు. అలాగే రైతు సమస్యలు, హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరందించే వాటి గురించి చర్చించారు. అన్ని అంశాల మీద కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే అన్ని అంశాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తానని.. నియోజకవర్గ అభివృద్ధికి మా వైపు నుంచి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్ కుమార్ ను కలిశారు. నియోజకవర్గంలో ఉన్న శాంతి భద్రతల గురించి చర్చించారు. ధర్మవరంలో ఒకప్పటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితుల గురించి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ధర్మవరం ప్రాంతం ప్రశాంతంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని.. ఇందుకు తమ వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని శ్రీరామ్ తెలిపారు.



# వైసీపీ నుండి టీడీపీలోకి చేరిన ఏడు కుటుంబాలు

### కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి వైసీపీని వీడి.. తెలుగుదేశం పార్టీలోకి చేరిక..

### పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మంత్రి సవిత

పెనుకొండ, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: పెనుకొండ నియోజకవర్గంలోని సోమందే పల్లి మండలం ఛాలకూరు గ్రామానికి చెందిన ఏడు వైసీపీ కుటుంబాలు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆహ్వానించారు, సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోనూ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమలకు ఆకర్షితులై పార్టీలోకి చేరేమన్నారు, అదేవిదంగా పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి సవితమ్మ సారథ్యం లో నియోజకవర్గం అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమందేపల్లి మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పోలేరమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే విజయశ్రీ







నాయుడుపేట, సూర్యవాస్తవం, సెప్టెంబర్ 30: శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నాయుడుపేట పట్టణం లోని గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పార్థసారథి దంపతుల తోపాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అమృత సరళ దంపతులు పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలేరమ్మకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు అమ్మవారికి పూజలు చేసి ఎమ్మెల్యే దంపతుల తోపాటు నెలవల సుబ్రహ్మణ్యం దంపతులను ఆశీర్వదించారు. అనంతరంవారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,ఆలయ కమిటీ సభ్యులు,నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, పోట్లపూడి రాజేష్,పెసల కిషోర్ బాబు, ఆకుతోట రమేష్, అవధానం సుధీర్, పలుకూరు ముత్యాలయ్య, వినుకొండ ధనంజయ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ పట్టణ నూతన కార్యాలయం ప్రారంభం

పుట్టపర్తి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: ధర్మవరం పట్టణంలోని హెచ్ పి గ్యాస్ ఆఫీస్ పక్కన నూతనముగా పట్టణ



బీజేపీ కార్యాలయాన్నీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ చేతుల మీదగా పూజా కార్యక్రమాలను నిర్వహించి బిజెపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన పట్టణ బీజేపీ కార్యాలయం ప్రార%శీ%భించిన సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ ను బీజేపీ జిల్లా అధ్యక్షులు జి. ఎం శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు, ధర్మవరం లో బీజేపీ నూతన కార్యాలయం ఏర్పాటు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె దేవానంద్, పట్టణ అధ్యక్షులు జింకా చంద్ర శేఖర్,సాకే



ఓబిలేసు,రాష్ట్ర చేనేత నాయకులు గిర్రాజు నాగేష్,మహేష్ ప్రజాపతి, ఓం ప్రకాష్ గౌడ్,పట్టణ బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గోరంట్లలో దుర్గాష్టమి వేడుకలు

గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: దుర్గాష్టమి పండుగ సందర్భంగా సెప్టెంబర్ 30 ప్రతి సంవత్సరం ఆనవాయితీలో భాగంగా గోరంట్ల పట్టణం లోని చౌడేశ్వరి కాలనీకి చెందిన దేవాంగ కులస్తులు ఆధ్వర్యంలో దేవాంగుల కుల దైవం శ్రీ రామలింగ చౌడేశ్వరి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు, పట్టణంలోని చిత్రావతి నది ఒడ్డున నుండి మాజీ మంత్రి , హిందూపురం మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప తనయుడు నిమ్మల అంబరీష్ వారి కుటుంబ సభ్యులు మరియు చౌడేశ్వరి కాలనీ వాసులతో కలిసి చౌడేశ్వరి దేవిని నెత్తిన పెట్టుకొని మోస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి చౌడేశ్వరి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న చౌడేశ్వరి దేవాలయం వరకు తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ మంత్రి,హిందూపురం మాజీ పార్లమెంట్ సభ్యులు నిమ్మల కిష్టప్ప, నిమ్మల అంబరీష్, నిమ్మల శిరీష్, నిమ్మల యువశేఖర్, నిమ్మల విద్య ధరణి, వార్డు సభ్యులు నాగరాజు, మాజీ సర్పంచ్ క్రిష్టప్ప, నిమ్మల శ్రీధర్ తోపాటు దేవాంగ కుటుంబ సభ్యులు మరియు చౌడేశ్వరి కాలనీ దేవాంగ కులస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అదే విధంగా గోరంట్ల పట్టణంలో చౌడేశ్వరి దేవస్థానం నూతనంగా నిర్మిస్తున్న చౌడేశ్వరిగుడి ఆవరణలో మాజీమంత్రి, హిందూపురం మాజీ పార్లమెంట్ సభ్యులు నిమ్మల కిష్టప్ప చేతుల మీదుగా ఉచిత కంటిచికిత్స శిబిరము ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్ ఫస్ట్ వార్డ్ మెంబర్ ఆగిశం నాగరాజు, మాజీ వార్డ్ మెంబర్ వట్టి సుధాకర్, నిర్వాహకులు అంబే వెంకటేష్, కర్ణ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





## ధనుష్ 'ఇడ్లీ కొట్టు'కి యూ సెన్సార్ సర్టిఫికేట్ ? పర్ఫెక్ట్ రన్‌టైమ్ లాక్ ? క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు

# గెట్ రెడీ



వెర్సటైల్ హీరో ధనుష్ ఎప్పుడూ వినూత్నమైన కథలతో అద్భుతమైన నటనతో అలరిస్తుంటారు. ప్రత్యేకమైన కథల ఎంపికతో డైరెక్టర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'పా పాండి', 'రాయన్' చిత్రాలతో వరుస విజయాలు సాధించిన ఆయన, 'జాబిలమ్మ నీకు అంత కోపమా' వంటి యూత్‌ఫుల్ ఫీల్‌గుడ్ చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన తర్వాత, ఇప్పుడు తన డైరెక్షన్ లో నాలుగో సినిమాగా ఇడ్లీ కొట్టుతో వస్తున్నారు.

147 నిమిషాల పర్ఫెక్ట్ రన్ టైం తో ఈ చిత్రానికి యూ సర్టిఫికేట్ లభించింది. గత సినిమాలకంటే భిన్నంగా, ఇడ్లీ కొట్టు గ్రామీణ వాతావరణంలో సాగే, భావోద్వేగాలు కథ. ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఫ్యామిలీ వాల్యూస్, ఎమోషనల్ లేయర్లతో ధనుష్ స్టోరీటెల్లింగ్ అదిరిపోయింది.

తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను ఎస్విఎం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రామారావు చింతలపల్లి గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే ట్రైలర్, ప్రమోషన్లు అద్భుతమైన రెస్పాన్స్ అందుకున్నాయి. సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

అలాగే ధనుష్, నిత్యా మీనన్ జంట మరోసారి రీయూనియన్ అవ్వడం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీరిద్దరి కెమిస్ట్రీ తిరు చిత్రంలో ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకుంది. మరోసారి అలరించడానికి సిద్ధం కావడంతో ఫ్యాన్స్ ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.

అద్భుతమైన ప్రీ రిలీజ్ రిపోర్ట్స్‌తో రేపటి నుండి థియేటర్లలో రిలీజవుతున్న ఈ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కోసం గెట్ రెడీ.



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వంలో ఖీఐఆ స్టూడియోస్ 'మహాకాళి'–

# 'మహాకాళి'

అసురుల గురువు శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా ఫస్ట్ లుక్ రిలీజ్ ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (ఖఎఅజ)లో తొలి చిత్రం హనుమాన్ పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్ హిట్ అయ్యింది. ఈ యూనివర్స్ లో నెక్స్ట్ ఇంస్టాల్మెంట్ మహాకాళి. దీనిని ఖీఐఆ స్టూడియోస్ బ్యానర్ పై రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మించారు. ఖీఐ దుగ్గల్ సమర్పిస్తున్నారు. ప్రశాంత్ వర్మ క్రియేటర్, షోరన్నర్‌గా వ్యవహరిస్తుండగా, పూజ అపర్ణ కొల్లూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ ఛావాలో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన బాలీవుడ్ స్టార్ అక్షయ్ ఖన్నా మహాకాళిలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇది ఆయనకి తెలుగులో తొలి చిత్రం. ఛావా విజయం తర్వాత ఆఫర్లు వెల్లువెత్తినప్పటికీ, కథ బలం, అతని పాత్ర డెప్త్ ద్వారా అక్షయ్ తన తెలుగు రిలీజ్ కోసం మహాకాళిని ఎంచుకున్నారు. అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ, సినిమాలోని అతని ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. హిందూ పురాణాలలో అసురుల గురువు శుక్రాచార్యుడు గా ఒక భారీ పర్వత కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన లుక్ అదిరిపోయింది.

తపోవ్రత వస్త్రాలు, చీకటినీ చీల్చే కాంతివంతమైన కళ్ళతో శుక్రాచార్యుడి రూపం అద్భుతంగా దర్శనమిస్తుంది. దేవతలూ ? దానవులూ ఇద్దరి భవితవ్యాన్ని మలిచిన మహర్షిగా, ఆయనను చిత్రంలో అద్భుతమైన పాత్ర చూపించబోతున్నారు. శుక్రాచార్యుడు కేవలం ఋషి మాత్రమే కాదు, జ్ఞానం, విరోధం, విశ్వాధికారానికి ప్రతీకగా సజీవ చిహ్నంగా చూపించారు. సనాతన విద్యకు ఆచార్యుడు, మరణించిన వారిని బతికించగల మృత-సంజీవని మంత్రం రహస్యం తెలిసిన శుక్రాచార్యుడు అసురుల ఆధ్యాత్మిక మార్గదర్శకుడు మాత్రమే కాదు, అపారమైన వ్యూహకర్త. ఈ చిత్రానికి సంగీతాన్ని స్మరణ్ సాయి అందించగా, సినిమాటోగ్రఫీని సురేష్ రగుతు నిర్వహిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్‌గా శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వెంకట్ కుమార్ జెట్టి వ్యవహరిస్తున్నారు. మహాకాళి చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం షూట్ పూర్తి కాగా, డిసెంబర్ నాటికి మొత్తం ప్రొడక్షన్ పూర్తి చేస్తారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సైమల్టేనియస్ కొనసాగుతున్నాయి. విడుదల తేదీని త్వరలోనే మేకర్స్ అనౌన్స్ చేస్తారు తారాగణం: అక్షయ్ ఖన్నా

# యూనిక్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

విష్ణు విశాల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఆర్యన్'. డార్క్ అండ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని శుభ్ర, ఆర్యన్ రమేష్‌తో కలిసి విష్ణు విశాల్ స్టూడియోస్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి ప్రవీణ్ కె దర్శకత్వం వహించారు. అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా తమిళం, తెలుగు భాషలలో విడుదల కానున్న ఈ చిత్ర టీజర్ మంగళవారం విడుదలైంది. ఒక థ్రిల్లింగ్ హత్య దర్యాప్తు, విష్ణు విశాల్ పాత్రను ఆసక్తికరంగా పరిచయం చేస్తూ ఈ టీజర్ ప్రేక్షకులను డార్క్ అండ్ ఇంటెన్స్ వరల్డ్‌ని తీసుకెళు తుంది. తనదైన శైలిలో విభిన్నమైన పాత్రతో విష్ణు విశాల్ ఆకట్టుకున్నారు. 34 నెలల విరామం తర్వాత విష్ణు విశాల్ ఈ శక్తివంతమైన టీజర్‌తో సోలో లీడ్‌గా కమ్ బ్యాక్ ఇచ్చారు.

'రాట్ససన్' విజయం తర్వాత, విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రంలో సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటించగా, సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్,అభిషేక్ జోసెఫ్ జార్జ్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఒక యూనిక్ ఇన్వెస్టిగేటివ్ యాక్షన్ థ్రిల్లర్‌గా దర్శకుడు ప్రవీణ్ కె దీన్ని తెరకెక్కించారు అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి డీఓపీ- హరీష్ కన్నన్, సంగీతం %-% జిబ్రాన్, ఎడిటర్ %-% శాన్ లోకేష్. స్టంట్స్ %-% స్టంట్ సిల్వా, పిసి స్టంట్స్ ప్రభు, ఎడిషల్ స్క్రీన్ ప్లే %-% మను ఆనంద్,



ప్రొడక్షన్ డిజైన్ %-% ఎస్.జయచంద్రన్.



# శ్రీలంకపై భారత్ ఘన విజయం



ఆతిథ్య జట్ల సమరంలో అదిరే విజయం సాధించిన భారత్ ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ వేటను ఘనంగా మొదలెట్టింది. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో బ్యాట్‌తో, బంతితో టీమ్ ఇండియా ఆకట్టుకుంది. తొలుత భారత్ 47 ఓవర్లలో 269/8 పరుగులు చేయగా.. శ్రీలంక ఛేదనలో 45.4 ఓవర్లలో 211 పరుగులకు కుప్పకూలింది. 59 పరుగుల తేడాతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ ఘన విజయం సాధించింది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో ఆదివారం పొరుగు దేశం పాకిస్తాన్‌తో కొలంబో వేదికగా తలపడనుంది.

ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిసింది. తొలుత 53 పరుగుల ఇన్నింగ్స్‌తో కదం తొక్కిన దీప్తి శర్మ.. తర్వాత మూడు వికెట్లతో మాయాజాలం చేసింది. దీంతో మంగళవారం గువహటిలో జరిగిన ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ ఆరంభ మ్యాచ్‌లో సహ ఆతిథ్య శ్రీలంకపై భారత్ 59 పరుగుల తేడాతో డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఘన విజయం సాధించింది. దీప్తి శర్మకు తోడు స్నే%ఎ% రానా (2/32), శ్రీ చరణి (2/37) మాయ చేయటంతో శ్రీలంక ఏ దశలో లక్ష్యం దిశగా సాగలేదు. క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లు శ్రీలంకపై ఒత్తిడి పెంచారు. కెప్టెన్ చమరి ఆటపట్టు (43, 47 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), నీలాక్షిక సిల్వ (35, 29 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా శ్రీలంక బ్యాటర్లలో ఎవరూ రాణించలేదు. 45.4 ఓవర్లలో 211 పరుగులకు శ్రీలంక ఛేదనకు తెరపడింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 47 ఓవర్లలో 8 వికెట్లకు 269 పరుగులు చేసింది. యువ ఓపెనర్ ప్రతీక రావల్ (37, 59 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), హర్లీన్ డియోల్ (48, 64 బంతుల్లో 6 ఫోర్లు) సహా దీప్తి శర్మ (53, 53 బంతుల్లో 3 ఫోర్లు), అమన్జోత్ కౌర్ (57, 56 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. శ్రీలంక బౌలర్లలో రణవీర (4/46) నాలుగు వికెట్లు పడగొట్టింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన దీప్తి శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 47 ఓవర్లకు కుదించారు. గ్రూప్ దశలో భారత్ విజయంతో అదిరే ఆరంభం అందుకుంది. గ్రూప్ దశలో ఏడు మ్యాచుల అనంతరం టాప్-4లో నిలిచే జట్లు సెమీఫైనల్స్‌కు చేరతాయి.

**మాయ చేశారు**

270 పరుగుల భారీ ఛేదనలో శ్రీలంకకు మంచి ఆరంభం దక్కింది. ఓపెనర్ హాసిని పెరీరా (14) రెండు ఫోర్లతో దూకుడుగా ఆడింది. కెప్టెన్ చమరి ఆటపట్టు (43) సహజశైలిలో మెరిసింది. పవర్‌ప్లేలో 30/0తో సాగుతున్న ఇన్నింగ్స్‌ను పేసర్ క్రాంతి గౌడ్ కుదిపింది. ఓపెనర్ హాసిని వికెట్‌తో భారత్‌కు బ్రేక్ అందించింది. ఆటపట్టు, హర్షిత సమరవిక్రమ (29)లు రెండో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. దీంతో శ్రీలంక ఛేదనలో రేసులోనే నిలిచింది. ప్రమాదకరంగా మారుతున్న ఆటపట్టును దీప్తి శర్మ సాగనంపగా%ొ% తెలుగమ్మాయి శ్రీ చరణి సైతం మ్యాజిక్‌లో జతకలిసింది. . హర్షితను ఎల్బీగా అవుట్ చేసిన శ్రీ చరణి.. శ్రీలంక పతనానికి నాంది పలికింది. ఆ తర్వాత లంక అమ్మాయిలు వరుసగా వికెట్లు కోల్పోయారు. స్నే%ఎ% రానా, దీప్తి శర్మలు సైతం మిడిల్ ఓవర్లలో మాయాజాలం చేయటంతో.. శ్రీలంక చేతులెత్తేసింది. మిడిల్ ఆర్డర్‌లో గుణరత్నె (11), దిల్హారి (15), అనుష్క (6), సుగంధిక కుమారి (10) తేలిపోయారు. నీలాక్షిక సిల్వ (35) కాస్త ప్రతిఘటించినా.. ఓటమి అంతరం మాత్రమే కుదించగలిగింది. టెయిలెండర్లు ఆచిని కులసూరియ (17), ప్రబోధిని (14) భారత్ విజయాన్ని ఆలస్యం చేశారు. 45.4 ఓవర్లలో 211 పరుగులకు శ్రీలంక కుప్పకూలింది.

**దీప్తి ధనాధన్**

టాస్ నెగ్గిన శ్రీలంక తొలుత బౌలింగ్ ఎంచుకుంది. భీకర ఫామ్‌లో ఉన్న స్మృతీ మంధాన (8) రెండు ఫోర్లతో మెరిసినా.. ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. మంధాన నిష్క్రమణ పవర్‌ప్లే స్కోరుపై ప్రభావం చూపింది. తొలి పది ఓవర్లలో భారత్ 45 పరుగులే చేసింది. యువ ఓపెనర్ ప్రతీక రావల్ (37), హర్లీన్ డియోల్ (48) జోడీ రెండో వికెట్‌కు 96 బంతుల్లో 67 పరుగులతో అర్ధ సెంచరీ భాగస్వామ్యం నమోదు చేసి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశారు. కానీ ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (21), జెమీమా రొడ్రిగస్ (0), రిచా ఘోష్ (2) నిరాశపరిచారు. దీంతో 124/6తో భారత్ కష్టాల్లో కూరుకుంది. ఈ సమయంలో ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (53), అమన్జోత్ కౌర్ (57)లు ఏడో వికెట్‌కు 99 బంతుల్లోనే 103 పరుగుల భారీ భాగస్వామ్యం నిర్మించారు. అమన్జోత్ కౌర్ ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 45 బంతుల్లో అర్ధ సెంచరీ బాదగా.. దీప్తి శర్మ మూడు ఫోర్ల సాయంతో 50 బంతుల్లో ఫిఫ్టీ అందుకుంది. స్నే%ఎ% రానా (28 నాటౌట్, 15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), దీప్తి శర్మ ఎనిమిదో వికెట్‌కు 22 బంతుల్లోనే 42 పరుగులు పిండుకుని ఆఖర్లో విలువైన స్కోరు వేగం పెంచారు. 47 ఓవర్లలో 8 వికెట్లకు భారత్ 269 పరుగుల భారీ స్కోరు చేసింది. శ్రీలంక బౌలర్లలో రణవీర నాలుగు వికెట్లు ఖాతాలో వేసుకుంది.

**సంక్షిప్త స్కోరు వివరాలు :**

భారత మహిళల ఇన్నింగ్స్ : 269/8 (అమన్జోత్ కౌర్ 57, దీప్తి శర్మ 53, హర్లీన్ డియోల్ 48, రణవీర 4/46)

శ్రీలంక మహిళల ఇన్నింగ్స్ : 211/10 (చమరి ఆటపట్టు 43, నీలాక్షిక సిల్వ 35, దీప్తి శర్మ 3/54, శ్రీ చరణి 2/37)

# టెస్టు సవాల్‌కు సై

## గిల్ సేన సాధన షురూ



అహ్మదాబాద్ : వెస్టిండీస్‌తో 2 మ్యాచుల టెస్టు సిరీస్‌కు టీమ్ ఇండియా సై అంటోంది. ఆసియా కప్ విజయంతో సోమవారం స్వదేశానికి చేరుకున్న భారత క్రికెటర్లు నేరుగా తొలి టెస్టు వేదిక అహ్మదాబాద్‌కు చేరుకున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లు విశ్రాంతి తీసుకోగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్, ప్రసిద్ కృష్ణ, ధ్రువ్ జురెల్, కెఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, యశస్వి జైస్వాల్‌లు మంగళవారం ప్రాక్టీస్ సెషన్లో చెమటోడ్చారు. చీఫ్ కోచ్ గౌతం గంభీర్‌తో కలిసి శుభ్‌మన్ గిల్ తొలుత పిచ్‌ను పరిశీలించాడు. ఆటగాళ్లు సుమారు మూడు గంటల పాటు ప్రాక్టీస్ సెషన్లో సాధన చేశారు. భారత్, వెస్టిండీస్ తొలి టెస్టు రేపటి నుంచి అహ్మదాబాద్‌లో ఆరంభం కానుంది. తెలుగు క్రికెటర్లు నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్‌లు రెండు మ్యాచుల్లోనూ తుది జట్టులో నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# బ్యాడ్మింటన్ చాంప్ ఆనన్య జోడీ



**హైదరాబాద్:** వేమూరి సుధాకర్ స్మారక తెలంగాణ సబ్ జూనియర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బాలికల డబుల్స్ అండర్-17 విభాగంలో ఆనన్య రెడ్డి-చంద్రిక జోడీ విజేతగా నిలిచారు. మంగళవారం మొయినాబాద్‌లోని గుత్తా జ్వాల అకాడమీలో జరిగిన ఈ పోటీల్లో అండర్-17 ఫైనల్లో ఆనన్య-చంద్రిక (గేమ్‌పాయింట్ అకాడమీ) జోడీ 15-13, 15-8తో అదితి-లక్ష్య (జ్వాల అకాడమీ)పై గెలిచి టైటిల్ దక్కించుకున్నారు. బాలుర డబుల్స్‌లో గౌతం-హర్ష ద్వయం, మిక్స్‌డ్ డబుల్స్‌లో మహిధర్-గ్రేస్ జంట, సింగిల్స్‌లో అఖిలేష్, మహిళల సింగిల్స్ మాన్య టైటిళ్లు సాధించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ద్రోణాచార్య పురస్కార గ్రహీత ఎస్.ఎం ఆరీఫ్, దిగ్గజ షట్లర్ గుత్తా జ్వాల విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

# గాలికొచ్చిన పార్టీని గాల్లో కలిపిన ఏపీ ప్రజలు

## త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు

## రూ.మూడు కోట్లతో బీటీ రోడ్ నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి సవిత





సోమందేపల్లి, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30 : ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన రంగుల రెడ్డి, ఐదు సంవత్సరాలలో రాష్ట్రాన్ని రావణ కాష్టం చేశారన్నారు. గాలికొచ్చిన పార్టీని గాల్లోనే కలిపారని మంత్రి సవిత తెలిపారు, శ్రీ సత్య సాయి జిల్లా సోమందేపల్లి మండలం బుస్సయ్య గారిపల్లి లో నూతన బిటి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు, 3 కోట్ల రూపాయలు నిధులతో 9 కిలోమీటర్లు నిర్మించనున్న నూతన రోడ్డు తో సోమందేపల్లి, గోరంట్ల మండలాల ప్రజలకు ఎంతో అనుకూలమవుతు న్నారు, 2024 ఎన్నికల ప్రచారంలో బుసయ్య గారి పల్లి ప్రజలకు మాట ఇచ్చా నని, భూమి పూజ చేయడానికి మీ ఊరికి వస్తా అని నాడు హామీ ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం నేడు భూమి పూజ చేశానన్నారు, అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికా రంలోకి వచ్చిన రంగుల రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశార న్నారు, నేను అధికారంలోకి వస్తే పోలవరం పరుగులు పెట్టిస్తా, మెగా డీఎస్సీ విడుదల చేస్తా, సిపిఎస్ రద్దు చేస్తా అంటూ ఎన్నో మాటలు పలికారని, అవన్నీ కేవలం మాటలకే పరిమితమయ్యాయని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు, 2024 లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అఖండ మెజార్టీతో గెలిపించి, గాలికొచ్చిన పార్టీని గాలికే పంపారని, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పార్టీ ప్రతిచోట భూమి పూజలకే పరిమిత మయ్యారని, గాలిలోనే తిరుగుతూ ప్రజలకు గాలి మాటలు చెప్పారని, వారు వదిలేసిన పనులను కూటమి ప్రభుత్వం కేవలం 16 నెలల్లోనే పూర్తి చేసిందన్నారు, ప్రజలకు ఎటువంటి కష్టాలు రాకూడదని ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నరన్నారు, తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్న అంతమందికి కూడా ఈ పథకం ఇచ్చామని, దీపం 2 కింద ఉచిత సిలిండర్లు అందిస్తున్నామని, స్త్రీ శక్తి పథకం కింద ప్రతి ఆడపడుచుకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించామన్నారు, నేడు ప్రతి పుణ్యక్షేత్రానికి మహిళలు ఎంతో ఆనందంగా వెళ్లి, అమ్మవార్లను దర్శించుకుం టున్నారని, ఇన్ని మంచి పథకాలు పెట్టిన సీఎం చంద్ర బాబు నాయుడు బాగుండాలని ప్రజల కోరుకుంటున్నారు అన్నారు మంత్రి సవిత, త్వరలో అర్హులైన అందరికి పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు, అనారోగ్యాల పాలైన పేద ప్రజలకు, జర్నలిస్టులకు ఇరవై ఐదు లక్షల వరకు ఇన్సూరెన్స్ కల్పించిన ఏకైక ప్రభుత్వం కుటుంబ ప్రభుత్వం అని, ఓవైపు పోలవరం మరోవైపు అమరావతి అభివృద్ధి చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్టానికి విదేశాల నుండి పరిశ్రమలను తీసుకొస్తున్న ఘనత సీఎం చంద్రబాబుది అన్నారు, యువతకు మంచి భవిత ఇవ్వాలనే ఆలోచనతో విదేశాల నుండి ఆంధ్రప్రదేశ్ రాష్టానికి పెట్టుబడులు విరివిగా వచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డొక్కా సీతమ్మ పథకం ద్వారా సూపర్ ఫైన్ రైస్ తో మంచి నాణ్యమైన భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణ పేరిట మంచి యూనిఫారం, మంచి షూస్, బెల్టు, పుస్తకాలు అందించిన ఘనత మంత్రి, యువగల అధినేత నారా లోకేష్ ఔదార్యం అన్నారు, సీఎం చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, కక్షలు, పోకుండా రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని, ప్రజల సంతోషాలే ముఖ్యమని ముందుకు వెళ్తున్నారన్నారు, వైసీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మెడికల్ కాలేజీల నిర్మాణం చేయలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం పి పి పి విధానం ప్రవేశ పెడుతుంటే దాన్ని లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు మంత్రి సవిత, మీరు ఎక్కడ చూసినా నేడు టోల్ గేట్లు, విమానాశ్రయాలు పి పి పి విధానంలోనే నడుస్తున్నాయని, ఇవేమీ తెలియకుండా రంగులు రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నాడని, ఎవరిని చెప్పినా ఏం చేసినా పోలవరం పూర్తి చేసి దాని ద్వారా రాయలసీమకు నీరు అందించి, ఆంధ్రప్రదేశ్ ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా నిలబెట్టే సత్తా ఉన్న సీఎం చంద్రబాబు నాయుడుదన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పండుగ వేళ.. దూసుకొచ్చిన మృత్యు శకటం



### ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టిన లారీ - ముగ్గురి దుర్మరణం










పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: పత్తికొండ పట్టణం గుత్తి సర్కిల్ సాయిబాబా గుడి రోడ్డులో పండుగ సరుగుల కోసం వచ్చిన ముగ్గురు అనుకోని ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటన శిరీష, భూమిక, మితుకలు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.తుగ్గలి మండలం ముక్కెళ్ల గ్రామానికి చెందిన శిరీష, భూమిక, మితుకలు పండుగ సరుకుల కోసం పత్తికొండకు వచ్చారు. పండుగ, సరుకులు తీసుకుని తమ గ్రామమైన ముక్కెళ్ల గ్రామానికి వెళ్లడానికి ఆటోలో బయలుదేరారు. అప్పుడే బియ్యం లోడుతో మిట్టపై వెళ్తున్న లారీ వేగంగా వచ్చింది. బ్రేకులు ఫెయిలవడంతో పైభాగం నుండి కింది భాగంలో ఉన్న ఆటోలను లారీ ఢీకొట్టింది. దీంతో శిరీష భూమిక, మితుకలు అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.భూమిక కుమార్తె మితుక, కుమారుడితో పండుగ సరుకుల కోసం కుటుంబంతో వచ్చింది. భూమిక అమె కూతురు శ్రీ నితి క క చనిపోగా, ఏడాది వయస్సు ఉన్న బాబు బ్రతికి బయటపడ్డాడు. చనిపోయిన భార్య భూమిక, కూతురు శ్రీ నితిక ను చూసిన భర్త సుమన్ తల్లిడిల్లిపోయాడు. ఒకేసారి చనిపోవడంతో కన్నీరు మున్నీరు అయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**రోడ్డు విస్తరణ ఎప్పుడో..!:** పత్తికొండ రోడ్లు వెడల్పు చేయకపోవడంతో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ చిక్కులతో , రోడ్డు ప్రమాదాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజురోజుకు వాహనాల రద్దీ పెరిగిపోయి ట్రాఫిక్ కష్టాలు తీవ్రమవుతున్నాయి.బస్సులు, లారీలు ఇతర పెద్ద వాహనాలు తిప్పడం కష్టంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో రోడ్డు ప్రమాదాలు బారిన పడుతున్నారు. గతంలో రెండు వరుసల రహదారి ఏర్పాటు చేసేందుకు సర్వేలు నిర్వహించారు. అయినా జరగలేదు...ఏళ్లకేళ్లు 'దారి'ద్ర్యం వెంటాడుతున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడని, ఇకనైనా ప్రభుత్వం చొరవ చూపి రోడ్లకు విస్తీరణ చేయించాలని పత్తికొండ ప్రజానీకం వేడుకుంటున్నది.

# వైసీపీ కార్యకర్తలకు భరోసాగా డిజిటల్ బుక్: రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి



పెళ్లకూరు, సూర్య వాస్తవం సెప్టెంబర్ 30: కూటమి ప్రభుత్వ అన్యాయానికి గురైన వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు అండగా నిలిచి భరోసా కల్పించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిజిటల్ బుక్ ను ఏర్పాటు చేసిందని వైయస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎండీసీసీబీ చైర్మన్ అన్నారు. మంగళవారం చిల్లకూరు లోని వైఎస్ఆర్సిపి క్యాంపు కార్యాలయంలో వైసిపి నాయకు లతో కలిసి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడారు.అన్యాయానికి గురైన కార్యకర్తలు వైఎస్ఆర్సిపి అధినేత జగన్ ప్రవేశపెట్టిన యాప్ లోకి వెళ్లి డిజిటల్ బుక్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి మండలాధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, బీసీ సెల్ అధ్యక్షులు దయానంద్, యెల్లు మోహన్, రఘు నాయుడు, మాతయ్య, కన్నలి కుమార్, సాగి జితేంద్ర, ముని రాజా ,బాలు, శ్రీనివాస్ రాజు ,వైఎస్ఆర్సిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేనమామ కొడుడిపై దాడి చేసిన మేనత్త కొడుకు

- మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదన్న కోపంతోనే దాడి



అనంతపురం క్రైం, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: బుక్కరాయ సముద్రం గ్రామానికి చెందిన కేశన్నపై స్వయాన అతని మేనత్త కొడుకైన సుబ్బారావు ఈరోజు స్థానిక పాతవూరులో కొడవలితో దాడి చేశాడు.ఎడమ చేతికి రక్తగాయం కావడంతో కేశన్న స్థానికంగా ఉన్న ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రతీరోజు తాగడానికి డబ్బు డిమాండ్ చేయడం ఇవ్వకపోతే భౌతికంగా దాడి చేయడం సుబ్బారావుకు పరిపాటిగా మారినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడయింది. మంగళవారం నాడు సాయంత్రం కూడా మద్యం కోసం డబ్బు డిమాండ్ చేశాడు ఇవ్వకపోవడంతో కొడవలితో దాడి చేశాడని... కేశన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని అనంతపురం ఒకటవ పట్టణ సి.ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.కేవలం ఇద్దరు సమీప బంధువుల మధ్య జరిగిన ఘటనేనని... కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని ప్రచారం చేయడంలో వాస్తవం లేదన్నారు

# దుర్గాష్టమి వేడుకల్లో నిమ్మల శ్రీధర్



గోరంట్ల, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: గోరంట్ల మండల కేంద్రం లోని చౌడేశ్వరీ కాలనీలో రామలింగ చౌడేశ్వరీ దేవాలయం నందు దుర్గాష్టమీ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్బంగా ప్రత్యేక పూజ కార్యక్రమంలో గోరంట్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ యజమాని నిమ్మల శ్రీధర్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దేవాంగం శ్రీనివాసులు, కట్ట నారాయణ, మహేష్ తో పాటు దేవాంగ కులస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానించిన మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ



నాయుడుపేట, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 30: సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,పార్థసారథి దంపతులను నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ ఘనంగా సన్మానించారు.శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాయుడుపేట పట్టణంలోని గ్రామదేవత శ్రీ పోలేరమ్మకు మంగళవారం ఎమ్మెల్యే దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ ఎమ్మెల్యే దంపతులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు ఆధ్వర్యంలోనూ..

సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,పార్థసారథి దంపతులను నాయుడుపేట శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు ఘనంగా సన్మానించారు.శరవన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాయుడుపేట పట్టణంలోని గ్రామదేవత శ్రీ పోలేరమ్మ కు మంగళవారం ఎమ్మెల్యే దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా నాయుడుపేట శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు ఎమ్మెల్యే దంపతులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )